
# గెలుపెవరిది?

కె. శివరాజు

**అతడిది ప్రేమకాదు— కామం. ఆమెది బాధ కాదు— ఆరాటం. ఇద్దరికీ పొంతన కుదరక దారులు వేరయ్యాయి. కాని మరో మహిళ అతడి వలలో చిక్కుకుంది. ఇంతకూ గెలుపెవరిది?**



శ్రీమతి కాఫీ త్రాగి, రిలాక్సింగ్‌గా కూర్చుని పేపర్ చదువుతూ వుంది. ఆఫీసు పనితో అలిసిపోయి వచ్చిన శ్రీమతికి సాయంత్రం సమయంలోనే పేపర్ చూసే తీరిక దొరుకుతుంది. ఆర్డీవో పగలంతా క్యాంపులు, ఆఫీసు పనితో అలిసిపోయిన ఆమె వీలైనంతవరకూ ఆరు గంటలయ్యేసరికి ఇంటికి వచ్చేస్తుంది.

చదవడానికి పేపర్ విప్పిందో లేదో వెంటనే ఫోన్ రింగయింది.

'హలో ఎవరూ మాట్లాడేది?' అంది శ్రీమతి

'నేనే సుజాతను మాట్లాడుతున్నాను'

'హాయ్ . సుజాతా! నువ్వా. చాలా కాలం తర్వాత నీ గొంతు వింటున్నాను. ఏమిటి ఎప్పుడొచ్చావ్?' అంది.

సుజాత శ్రీమతి కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఆ రోజుల్లో రెండు కుటుంబాలు ఒకేవీధిలో వుండడం, ఇద్దరూ ఒకే క్లాసు కావడం — ఈ రెండు ఇద్దరి మధ్యా సన్నిహితభావాన్ని కలిగించడంతో రోజులో ఎక్కువకాలం ఇద్దరూ కలిసే వుండేవారు. పూవునుండి తావిని ఎలా విడదీయలేమో, అలా విడిపోని స్నేహబంధం ఇద్దరి మధ్య ఏర్పడింది. అయితే ఇద్దరూ విడిపోయి ఇప్పటికి పది వసంతాలు దాటినా ఒకరినొకరు మరిచిపోలేదు.

''ఈరోజే వచ్చాను గానీ ఎలా వున్నావ్'' అని తీయని గొంతుతో అడిగింది.

''నా గురించి అడుగుతున్నావా? నాకేం బాగానే వున్నానే. కానీ బాగాలేనిది జీవితమేనే'' అంది నవ్వుతూ.

''ఏమిటి! కదంతొక్కే వయస్సులో వేదాంతం మాట్లాడుతున్నావ్. ఏమయ్యిందే?''

''ఏమీ కాలేదుగానీ ఒక్కసారి ఇంటికి రా! నిన్ను చూసి చాలా రోజులయింది. వస్తావుగా?''

''రాకుండా ఎలా వుంటానే, వస్తాను. ఈ రోజు రెస్టు తీసుకొని రేపు వస్తా. కాస్త బడలికగా వుంది''

''ఒకే. రేపు లంచ్‌కి వుండిపోవాలి. మర్చిపోకు. బైబై'' అని ఫోన్ పెట్టేసింది శ్రీమతి.

స్నేహితురాలికి మాట ఇచ్చిన ప్రకారం సుజాత శ్రీమతి ఇంటికి వచ్చింది. ఇద్దరూ నవ్వుతూ తుళ్లుతూ మాట్లాడుకుంటూ టిఫిన్, కాఫీ తీసుకున్నారు. సుజాత కోసం, ఆమెతో సంతోషంగా కాలం గడపటానికి శ్రీమతి ఆరోజు శెలవు పెట్టి ఇంటిదగ్గరే వుండిపోయింది.

''శ్రీ ఇంట్లో ఎవరూ కనిపించరేమిటి? అమ్మానాన్న పిల్లలు ఎవ్వరూ లేరేమిటే?'' అడిగింది సుజాత.

''నేనే వున్నాను. అమ్మానాన్న మా పిన్నిగారింటికి వెళ్ళారు''

''అయితే శ్రీమతీ... పిల్లలు...'' అని శ్రీమతి సంసార జీవితం గురించి అడిగింది సుజాత.

కానీ శ్రీమతికి గుండెను కాల్చే తన స్వవిషయాలు చెప్పి సుజాత మనసు నొప్పించే ఉద్దేశం లేదు. కానీ జరిగిన కథ చెప్పి గుండెలను పిండేస్తున్న బాధను చెప్పి వుపశమనం పొందాలని మనస్సు సిద్ధపడుతున్నా శ్రీమతి మనస్సుని అదుపులో వుంచుకుంది. ఇంటిగుట్టు రచ్చకెక్కించడం కంటే మాట కన్నా మౌనమే గొప్పదని ఏమీ చెప్పకుండా మభావంగా వుండిపోయింది.

ఇక చాలా కాలం తర్వాత కలిసిన ఆత్మీయురాలి గురించి తెలుసుకోవాలనే మనోభావంతో సుజాత అడిగిన ఒక్క ప్రశ్నకూ శ్రీమతి నుండి జవాబు రాలేదు.

''ఏమిటే సమాధానం చెప్పకుండా వుండిపోయావేమిటి?'' అని శ్రీమతిని మళ్లీ అడిగింది సుజాత.

''సుజీ. ఎన్నో ఏళ్ళ తర్వాత కలిశాం. ఈ కాస్తసమయాన్ని సంతోషంగా గడపాలి గానీ విషాద కథలతో మనస్సు వికలం చేసికోవటం గతాన్ని గురించి చింతించడం నాకిష్టంలేదు. నా జీవితం నిస్తేజంగా, నిరాసక్తంగా గడిచిపోతోంది. విని సంతోషించవలసిన పెద్దవిషయాలు ఏమీ లేవు.నీ కథ చెప్పు వింటాను'' అంది.

శ్రీమతి మాటలు విని సుజాత ఆశ్చర్యపోతూ ''అదేమిటే నీ విషయం నాకేమీ అర్థం కావడంలేదు. అస్తమించే సూర్యునిలా ఇలా చల్లబడిపోయావేమిటి? ''

అర్థం కావడానికేముంది ఈ ప్రపంచంలో అర్థంకాని దేమన్నా వుంటే అది జీవితం ఒక్కటే. వేదాలు చదివినా, వైజ్ఞానికంగా మనిషి ఎదిగినా ఎవరికీ అర్థంకానిది మనిషి జీవితం. అణువును క్షణిపెట్టినా మనిషి ప్రవృత్తిని కనిపెట్టలేని స్థితిలో వుంది పరిస్థితి.

ఆశలు తీరనప్పుడు వాటిని తీర్చుకొడానికి మోసాలు, దగాలకు, వంచనకు దిగజారిపోయి ఎదుటివారి జీవితాలు ఏమైనా తనకక్కర్లేదనే స్థాయికి తలవంచి బతుకుతున్నాడు. ప్రస్తుతానికి ఇవన్నీ కలిసినదే నా జీవితం అని అన్యాపదేశంగా తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పింది.

కానీ శ్రీమతి చెప్పినదేదీ సుజాతకు అర్థం కాలేదు. మనిషి జీవితం గురించి సుజాత అంత దూరంగా ఎప్పుడూ ఆలోచించలేదు. భర్తతో సుఖపడడం, పిల్లల్ని చూసి సంతోషపడటం, కావలసిన కోర్కెలు తీర్చుకోవడం ఇదే ఆమె జీవనవిధానం.

కానీ శ్రీమతికి మాత్రం వ్యక్తిత్వం, నీతి నిజాయితీ, మాట నిలకడ వంటివాటిపై పట్టుదల ఎక్కువ. దొరికినంత మేరకు సంతోషాన్ని దక్కించుకుని జీవితాన్ని సాగించడం సుజాతకు సంతోషం.

''శ్రీ. నువ్వూ, నీ వేదాంతం ఇవన్నీ నాకర్థం కావు. అనవసరం కూడా. అసలు నీ సంగతి చెప్పకుండా తప్పించుకోటానికి చెప్తున్నావు. ఏం జరిగిందీ? అంత నిరాశగా వున్నావు?'' అని అడిగింది.

''నే చెప్పేవన్నీ నిజాలేనే. తప్పించుకోటాని కేముంది?'' అని అన్నా ఆమె కంఠంలో నిరాశ స్పష్టంగా ధ్వనిస్తూనే వుంది.

''నోనో... నువ్వు ఏదో దాస్తున్నావ్. నిజం చెప్పు'' అని బలవంతం చేసింది సుజాత.

ఈలోగా అటెండర్ కాఫీ తెస్తే ఇద్దరూ తాగారు.

''ఊ. చెప్పు'' అంది సుజాత కప్పు టేబుల్‌మీద పెడుతూ.

''సుజాతా! నేను చెప్పిన తర్వాత నువ్వు అయ్యో అని బాధపడకూడదు మరి. అలా అయితేనే చెప్తాను''

''అలాగే చెప్పు'' అంది సుజాత.

''సుజాతా! నువ్వెళ్ళి పోయిన తర్వాత రఘు అనే అతనితో నాకు పరిచయం ఏర్పడింది. ప్రక్కవాటాలో అద్దెకుండేవాడు. కొన్ని రోజులు నావంక ఆశగా చూసేవాడు. ఏదో మిషతో మాట్లాడాలని ప్రయత్నించేవాడు. అవన్నీ నేను పట్టించుకోలేదు. ఒకరోజు తనకు తానుగా నాతో పరిచయం చేసుకున్నాడు. నిజాయితీ గలవాడన్న నమ్మకంతో మాట్లాడేదాన్ని. మాటలు కలిపిన తర్వాత క్రమంగా పరిచయం, చనువు పెరిగి సంభాషణల వరకూ సాగింది. ఆ తర్వాత ఒకరిమీద ఒకరికి ఆకర్షణ మొదలయింది ఆ ఆకర్షణ ఇద్దరినీ దగ్గరకు చేర్చింది.

మోసం జరగదనుకునే మోసపోయాను. సుందరంగా వుంటుందని తలచిన జీవితం చిందరవందరగా రూపుదిద్దుకుని నన్ను పైకి రాలేని అగాధంలో పడేసింది.

ప్రేమించానంటే మనసిచ్చాను కానీ అతను శరీరాన్ని కోరితే ఇష్టపడలేదు. నా అందాన్ని అనుభవించాలని ఎన్నో ప్రయత్నాలు చేసి ఫలితంలేదని తెలిసినప్పుడు చెప్పిన మాటలు పలికిన ప్రేమగీతాలు అన్నీ మర్చిపోయి వెళ్ళిపోయాడు.

ఆడదంటే మగవాడు వినోదంగా కాలక్షేపానికి ఆడుకునే ఓ ఆటవస్తువు అని భావించిన అతని మనస్తత్వానికి నా మనస్సులో రోత పుట్టింది. జుగుప్స కలిగింది. అది నా స్వయంకృతాపరాధమని సరిపెట్టుకున్నాను. అద్దం విరిగితే శబ్దం వస్తుంది. మనస్సు విరిగితే అంతటా నిశ్శబ్దం ఆవరించి జీవితం స్తబ్దతగా వుండిపోతుంది. అలాగే నేను స్త్రీని కాబట్టి ఒకడికి మనసిచ్చి వంచింపబడిన స్థితిలో మరో మగవాడిని నమ్మి మనసివ్వడానికి, నా వ్యక్తిత్వాన్ని నేనే అవమానపరచుకోవడానికి నా అంతరాత్మ అంగీకరించలేదు.

నా ప్రేమ విషయం ఇంట్లో వాళ్ళకి తెలిసి అందరూ నేనే తొందరపడ్డానని నిందించారు. అందుకు నేను కాదని వాదించే అవకాశమూ లేదు. నాకు వాదించాలని కూడా లేదు.

సుజాతా! మనసివ్వడం ఆడదాని తప్పుకాదు. అసహజం అంతకన్నా కాదు. నైతికంగా దిగజారిన మనిషి ప్రతి ఆడదాని అందాన్ని అనుభవించాలనే హీనభావానికి తలవంచుతాడు. మరో మగవాడికి మనసిచ్చి మరోసారి మోసపోవటానికి ఇష్టపడలేదు.

కానీ విచిత్రమేమంటటే అదే వ్యక్తి రఘు పెళ్ళి చూపులకు నా దగ్గరకు వచ్చాడు. నన్ను చూసి నిర్ఘాంతపోయాడు. కానీ తన పురుషాధిక్యత నిరూపించుకోవాలని 'నువ్వు ఇంతకుముందు ఎవరినైనా ప్రేమించావా?' అని అడగకూడని ఒక ప్రశ్న వేసి పదిమందిలోనూ నన్ను అవమానించాడు.

ఆ స్థితిలో నేను అతన్ని ప్రతిఘటించక తప్పలేదు. అంతవరకూ సహనంగావున్న నా మనస్సు గర్జించి సింహరూపం ధరించింది. అక్కడ నా మాటలు ఎవరు వింటున్నారు? ఎందరు వింటున్నారోనన్న వివక్ష లేకుండా అతని నిర్వాకాన్ని బయటపెట్టాను. ఆడదానిపట్ల అతని అసభ్యమైన వ్యక్తిత్వాన్ని శరీరంతో పశువాంఛ తీర్చుకోవాలని భావించిన అతని నిజరూపాన్ని ఏకరువు పెట్టి చెప్పాను.

నీతినిజాయితీ వ్యక్తిత్వంలేని పశుప్రవృత్తిగల వ్యక్తికి భార్య కావడం నాకిష్టం లేదని తక్షణం పొమ్మన్నాను.

ఆ రోజు నుంచి మగవాడంటే నాలో ఏహ్యమైన భావం మొదలయింది. ఓ మగవాడికి భార్య పేరుతో జీవితాంతం బానిసగా పడివుండి అలాంటి వాడికి కేవలం పడక సుఖానికే ఆడదన్న భావదాస్యానికి తల వంచేందుకు ఇష్టపడలేదు. ఆ జీవితం యాంత్రికమైనదే గానీ పవిత్రతతో సాగేది మాత్రం కాదు.

ఈ సమాజంలో పెరిగి పెనువృక్షంలా రూపుదిద్దుకున్న మగవాడి గొప్పతనాన్ని, అహంకారాన్ని, అధికారాన్ని, పురుషాధిక్యాన్ని అంగీకరించి క్షణక్షణం ఓ సామాజిక బానిసగా జీవితాన్ని గడపడం నాకిష్టం లేదు. అలాంటి జీవితాన్ని నేను ఊహించనైనా లేదు.

నిజానికి స్త్రీకి మగవాడి అవసరం ఎంతో మగవాడికి ఆడదాని అవసరం కూడా అంతేనన్న వాదన సత్యమని నమ్మి నా వ్యక్తిత్వానికి భంగం రాకూడదని మళ్లీ పెళ్ళి చేసుకోలేదు. మా వాళ్ళు చేసినా నేను అంగీకరించలేదు.

సుజాతా! శారీరక వాంఛలు తీర్చడానికి, తీర్చుకోటానికి అయితే ఆడదానికి మంగళసూత్రం కట్టే మగాళ్ళు క్రిమికీటక సంఖ్యకన్నా అధికంగానే వుంటారు. వివాహం అతి పవిత్రమైనదని ఘోషించే ఈ సమాజం దాన్ని శారీరక సుఖాలకు పరిమితం చేసి బతికే వ్యవస్థమీద నాకే గౌరవమూ లేదు. అటువంటి పెళ్లీ అక్కర్లేదు.

ఎదుగుతున్న ఆడదాన్ని చూసి సహించలేని పురుషులు వివాహ సంస్కార పవిత్రతను ప్రక్కనపెట్టి ఆడదాని జీవితాన్ని పడకగదికి, వంటగదికి పరిమితం చేసి తలవంచుతున్నారు. అది ధర్మం కాదని అనుకోవడం లేదు. సమానహక్కుందని అంగీకరించటమూ లేదు. నా జీవితం నాకు నేర్పిన పాఠంతో కృషి చేసి క్లాస్‌వన్ ఆఫీసర్ని కాగలిగాను. ఆ తర్వాత అదే రఘు నా అధికార పరిధిలో పనిచేస్తూ తోటి స్త్రీ ఉద్యోగులపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఆఫీసులో పనిచేసే స్త్రీ వుద్యోగులను తన పశువాంఛలు తీర్చుకోవడానికి వాళ్ళను వేధిస్తే ఆ నేరం రుజువై అతన్ని ఉద్యోగం నుంచి తొలగించవలసిందిగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం నేనే అతన్ని ఉద్యోగం నుంచి తొలగించి ఇంటికి పంపించాను. ఈ కథ చాలా ఇంకా చెప్పనా? అని అడిగింది శ్రీమతి.

అంతా విన్న సుజాతకు నెత్తిన పిడుగు పడినట్లయింది. కాస్త ఆందోళన కూడా కలిగినా తమాయించుకుని 'శ్రీమతి రఘు అంటే మాధవరావుగారి కొడుకేనా?' అని వివరాలు అడిగింది.

'ఆ! ఎగ్జాట్లీ! ఆ మాధవరావు కొడుకే' అని 'అవునూ! ఆ వివరాలు ఎందుకే అడుగుతున్నావు,అతను నీకూ తెలుసా?' అడిగింది సుజాతను.

''ఆ తెలుసునే. అతనే నా భర్త' అని ఇక అక్కడ వుండలేక, వుండి శ్రీమతి ముఖం చూడలేక బాధతో చరచరా వెళ్ళిపోయింది సుజాత.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం, నిర్ఘాంతపోయి వెళ్ళిపోతున్న సుజాతను చూస్తూ వుండిపోవడం శ్రీమతి వంతు అయ్యింది